క్లుప్తంగా

జగనన్న పాలనలో ప్రతి గడపకూ పథకాలు



ఆటోకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ అతికిస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 13 వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పథకాల అమలు, అభివృద్ధి, టీడీపీ హయాంలో పాలన ఎలా సాగింది, జగనన్న పాలన తేడాలను వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబును అధికారంలోకి తేవడానికి ఎల్లో మీడియా తప్పుడు రాతలు రాస్తోందన్నారు. సచివాలయ కన్వీనర్లు విజయ భాస్కర్, శ్రీను, గృహసారథులు, నాయకుడు అబూబక్కర్ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలపై ఈ నెల 25వ తేదీన పట్టణంలోని గౌడ్‌సెంటర్ వద్ద నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ తాలూకా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, మండల కార్యదర్శి నరసింహనాయక్ పిలుపునిచ్చారు. స్థానిక ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు , జిల్లా కార్యదర్శి రంగనాయకులు , సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏసురత్నం, రాజశేఖర్ హాజరవుతారని చెప్పారు. పట్టణ ప్రజలు, మేధావులు, కార్మికులు,కర్షకులు, ఉద్యోగులు హాజరు కావాలని కోరారు. నాయకులు మాబాషా, వెంకటేశ్వర్లు, రామ్‌నాయక్ పాల్గొన్నారు.

నీటి విడుదలకు చర్యలు తీసుకోండి

శ్రీశైలంప్రాజెక్ట్: వెస్టన్ కాలనీ ప్రాంతంలో వారానికి ఒక్కసారి నీటి సరఫరా అవుతోందని స్థానికులు తన దృష్టికి తెచ్చారని, నీటి సరఫరాకు తక్షణమే చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ డీఈ సీహెచ్ చిట్టిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫక్కీరయ్యను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదివారం ఆదేశించారు. అయితే తక్షణ పరిష్కారం చేయాలంటే పాత పైప్‌లైన్‌కు , కొత్త పైప్‌లైన్‌కు లింక్‌అప్ చేయాల్సి ఉందని, ఇందుకు నిధుల కొరత ఉందని ఇంజినీర్లు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే శిల్పా తన సొంత డబ్బులను అందజేసి, మరింత సొమ్ము అవసరమైతే అందజేస్తానని, వెంటనే పనులు పూర్తి చేయాలని సూచించారు.

రేపు రుద్రమూర్తికి విశేష పూజలు

శ్రీశైలం : లోక కల్యాణార్థం శ్రీశైల ఆలయ ఈశాన్య భాగంలోనున్న రుద్రపార్క్‌లోని రుద్రమూర్తికి మంగళవారం శాస్త్రోక్తంగా పూజాధికాలు జరిపించనున్నారు. రుద్ర విగ్రహాన్ని గతంలో శంకర జయంతి రోజున నెలకొల్పారు. ఈ కారణంగాఏటా శంకర జయంతి రోజున రుద్రమూర్తికి ప్రత్యేక పూజలు చేస్తారు. కార్యక్రమంలో రుద్రమూర్తికి ఆపాదమస్తకంగా విశేష అభిషేకాలు, పూజా కార్యక్రమాలు జరిపిస్తారు. కాగా.. రుద్రుడి చల్లని చూపులు కృష్ణానదిపై ప్రసరించడం వల్ల నదిలో నీరు సమృద్ధిగా ఉండి, పంటలు బాగా పండుతాయని, అలాగే శ్రీశైలం ఆనకట్ట ఎల్లప్పుడూ పరిరక్షింపబడుతుందని పలువురు ఆధ్యాత్మికవేత్తలు సూచనతో ఆలయ ఈశాన్య భాగంలో కృష్ణానదికి అభిముఖంగా రుద్రుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

ఆటోను ఢీకొట్టిన బైక్

మహానంది: ఒక బైక్‌పై ముగ్గురు, ఆపై వేగంగా వెళ్తూ.. ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనగా ఇద్దరు యువకులకు గాయాలైన సంఘటన బుక్కాపురం సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. నంద్యాలకు చెందిన బాషా, సమీర్, మరొకరు మహానంది నుంచి బైక్‌పై వెళ్తుండగా బుక్కాపురం-తమ్మడపల్లె సమీపంలోని మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

నాటుసారా బట్టీపై దాడులు

మహానంది: గ్రామ సమీపంలోని నల్లమల అడవిలో నిర్వహిస్తున్న నాటుసారా బట్టీలపై మహానంది పోలీసులు దాడులు నిర్వహించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ జి.నాగేంద్రప్రసాద్, సిబ్బంది ఆదివారం నల్లమలలో దాడులు చేపట్టగా బట్టీ నిర్వాహకులు ఇద్దరు పరారైనట్లు చెప్పారు. మహానందికి చెందిన గోపిని అరెస్ట్ చేసి సారా స్వా. దీనం చేసుకున్నామని తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఆలయ పరిసరాల్లో ఎవరైనా మద్యం సేవించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా బట్టీలు, విక్రేతలపై ఆయా గ్రామాల ప్రజలు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

అద్వైతమూర్తి...ఆది శంకరాచార్యులు

- దేశ పర్యటనలో భాగంగా శ్రీశైలం వచ్చిన ఆది శంకరాచార్యులు
- 'శివానందలహరి' రచించింది ఇక్కడే
- భ్రమరాంబ చెంతన శ్రీచక్రం ప్రతిష్ఠ
- పాలధార-పంచధార వద్ద తపస్సు
- రేపు ఆది శంకరుల జయంతి



ఆదిశంకరాచార్యులు తపస్సు చేసిన పాలధార-పంచధార ప్రదేశం,





ఆదిశంకరాచార్యులు, శారదాదేవి విగ్రహాలు, పార్వతీ పరమేశ్వర్లు శివలింగాన్ని ఇస్తున్న చిత్రం

శ్రీశైలం: జగద్గురువులుగా ప్రసిద్ధిగాంచిన ఆది శంకరాచార్యులకు శ్రీశైలానికి ఆధ్యాత్మిక అనుబంధం ఉంది. హిందూ ధర్మ సంరక్షణ అద్వైత సిద్ధాంత ప్రచారంలో భాగంగా దేశ పర్యటన చేస్తూ శ్రీగిరి క్షేత్రానికి చేరుకున్నారు. క్షేత్రానికి సమీపంలోని ఫాలధార- పంచధార సమీపంలో కొంతకాలం తపస్సమాధిలో తమ జన్మను సార్థకం చేసుకునే ప్రక్రియ ప్రారంభించారు. ఆ సమయంలోనే ఆయన కలం నుంచి 'శివానందలహరి' జాలువారింది. అందులోని 50, 51 శ్లోకాలలో మల్లికార్జున స్వామిని గురించి ప్రశంసిస్తూ రాశారు.శంకరులు రచించిన మరో గ్రంథం 'యోగతారావళి' అందులో శ్రీశైల శృంగ గుహల్లో ఎప్పుడు సమాధ్యవస్థను పొందుతానో గదా! అనే ఒక విధమైన ఆవేదనను ప్రకటించారు. ఆదిశంకరులు శ్రీశైల క్షేత్రంలో ఉన్న సమయంలో ఈ ప్రాంతంలో కాపాలికుల ప్రాబల్యం ఉండేది. తమ వామాచారధోరణులతో నరుల, పశువుల బలులతో అవైదిక పద్ధతులలో పూజాదికాలను నిర్విహించేవారు. ఈ దురాచాలన్నీ వేదవిరుద్ధమని ఖండించారు.

కత్తి దూసిన కాపాలికులు..

కాపాలికులు శంకరాచార్యులను ఏమీ చేయలేక హతమార్చాలని నిశ్చయించుకున్నారు. ఆయన వద్దకు వెళ్లి కాలభైరవుడు తమ ఆరాధ్య దైవమని, ఆయనకు చక్రవర్తిని గాని లేదా మీలాంటి మహాత్ముడిని బలి ఇస్తే మేలు జరుగుతుందని వినయపూర్వకంగా వేడుకున్నారు. అందుకు సమ్మతించిన శంకరాచార్యులు తన శిష్యులకు తెలియకుండా బలి ఇవ్వాల్సిందిగా వారిని కోరారు. తాము పాతాళగంగలో స్నానాదికాలను ఆచరించి అనుష్టానాన్ని ముగించిన తరువాత తనను బలి ఇవ్వవచ్చని కూడా ఆదిశంకరులు సూచించారు. కాపాలికుడు పెద్ద కత్తితో వీరవిహారం చేస్తూ ఆదిశంకరులున్న ప్రదేశాన్ని చేరుకున్నాడు. ఇదేమీ తనకు పట్టనట్లుగా ఆదిశంకరులు తపస్సులో మునిగిపోయారు. గమనించిన కాపాలికుడు తన పనికి అడ్డు ఉండదని తలచి ఆనందంగా కత్తిని ఎత్తి ఆదిశంకరుల శిరస్సును ఖండించబోయాడు. అయితే ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా నిశ్శబ్దం ఆవరించింది. నృసింహస్వామి ఆవహించుకున్న పద్మపాదుడు వెంటనే కాపాలికుడి చేతిలోని కత్తిని లాగి దూరంగా విసిరి వేసి హిరణ్యకశ్యపుడిని చీల్చినట్లుగా ఆ కాపాలికుడిని చీల్చేశాడు. దీంతో ఆ ప్రాంతమంతా రక్తసిక్తమైంది. కాపాలికుడి అనుచరులంతా నివ్వెరపోయారు. జరిగిన సంఘటనను ఆదిశంకరులు కళ్లు తెరచి చూశారు. ఎదురుగా రక్తపు మడుగులో కాపాలికుడు. అపర నరసింహుని వలే కోపంతో ఊగిపోతున్న తన శిష్యుడు పద్మపాదుని చూసిన వెంటనే శంకరులు తమ దివ్యదృష్టితో వాస్తవాన్ని గ్రహించాడు. శంకరులు నరసింహ స్తుతి చేసి శిష్యుణ్ణి శాంత పరిచారు. పద్మపాదునిలో పూని ఉన్న నరసింహస్వామి ఆయన నుంచి తొలగిపోవడంతో పద్మపాదులు మాములు మనిషిగా మారారు. వెంటనే గురువుగారికి పాదాభి వందనం చేసి వినయంగా పక్కకు నిలబడ్డాడు. ఇదంతా ఒక్క క్షణంలో కలలాగే జరిగిపోయింది. ఆది శంకరులకు శ్రీశైలంలోఉండడం ఒక ఎత్తైతే ఆయనకు జరిగిన ఈ ఘోరవిపత్తు మరొక ఎత్తు. అప్పటి నుంచి భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్లను కొలుచుకోవడానికి వచ్చే భక్తజనులకు ఏ విపత్తూ లేకుండా ఒక ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొనేటట్లుగా భ్రమరాంబాదేవి చెంతన శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించి ఆమె ఉగ్రరూపాన్ని ఉపసంహరించి శాంతి స్వభావంలో ఉండేలా యంత్ర ప్రతిష్ఠ చేశారు.

ఫాలధార-పంచధార వద్ద రేపు ప్రత్యేక పూజలు

శ్రీశైల మహాక్షేత్రానికి 3 కి.మీ దూరంలో ఉన్న పాలధార-పంచధార వద్ద ఉన్న ఆది శంకరచార్యుల మండపంలో మంగళవారం శంకర జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు. వైశాఖ శుద్ధ పంచమి ఉదయం 9 గంటలకు చతుర్వేద, శాస్త్ర, పురాణ పారాయణలతో జరిగే ఈ విశేష పూజలలో చంద్రమౌళీశ్వర స్వామికి, శారదాదేవికి, శంకరాచార్యులకు పంచామృతాభిషేకం, జలాభిషేకం, అర్చనలను వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఈఓ లవన్న తెలిపారు.

మరోసారి జగనన్నను ఆశీర్వదించండి

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరో సారి ఆశీర్వదించాలని ఎంపీటీసీ సోమల ప్రవంతి కోరారు. ఆదివారం గువ్వలకుంట్ల గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి పథకాలు, అభివృద్ధి, టీడీపీ పాలనతో జగనన్న పాలనను పోల్చి వివరించి నువ్వే మా నమ్మకం జగన్ స్టిక్కర్లను అతికించారు. నాయకులు సోమల రవీంద్రారెడ్డి, రామిరెడ్డి, చంద్రమౌళి, ప్రతాప్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

మిడుతూరు: ప్రతి ఇంటికి సంక్షేమ లబ్ధి చేకూరడంతోపాటు అవినీతికి తేవు లేకుండా పారదర్శక పాలనను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు షరీఫ్, నమ్మద్ అలీ తెలిపారు. ఆదివారం మండలంలోని దేవనూరు గ్రామంలో జగనన్నే మన భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై అవగాహన కల్పించారు. నాయకులు రామసిద్ధారెడ్డి, దేవరాజు, దాసు పాల్గొన్నారు.

విజ్ఞాన కేంద్రాలు గ్రంథాలయాలు

కొత్తపల్లి: విద్యార్థులకు విజ్ఞాన కేంద్రాలు గ్రంథాలయాలు అని లైబ్రేరియన్ కౌసల్య అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశనాయకుల, దేశ చరిత్రకు సంబంధించిన పుస్తకాలను అందజేసి విద్యార్థులతో పఠనం చేయించారు.

మోటార్లు రికవరీ అయ్యేనా?

- వ్యవసాయ మోటార్ల కోసం పోలీసుస్టేషన్ చుట్టూ రైతన్నల ప్రదక్షిణ
- మోటార్ల దొంగలను పోలీసులకు పట్టించిన అన్నదాతలు
- ఆరు రోజులుగా విచారణ జరుపుతున్న రక్షకభటులు

జూపాడుబంగ్లా: దోపిడీకి గురైన తమ వ్యవసాయ విద్యుత్, ఆయిల్ మోటార్లు దోపిడీ దొంగల నుంచి రికవరీ అయ్యేనా అని రైతులు ఎదురుచూస్తున్నారు. ఆరు మాసాల నుంచి మండలంలోని తరిగోపుల, పి.లింగాపురం, రామసముద్రం, కొత్తసిద్ధేశ్వరం, మండ్లెం, తర్తూరు, పాములపాడు మండలంలోని వాడాల తదితర గ్రామాల్లో సుమారు 100 మోటార్లు దోపిడీకి గురయ్యాయి. పొలాలకు నీరు పారించుకొనే విద్యుత్, ఆయిల్ మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్తుంటే రైతులు కొత్త మోటార్లు అమర్చుకొనేందుకు, దొంగలను కనిపెట్టేందుకు కంటిమీద కునుకులేకుండా గడిపిన రోజులు అనేకం.సాగుచేసిన పంటలకు నీరు కట్టుకొనే వ్యవసాయ మోటార్లను దోచుకెళ్తే పొలాలకు నీళ్లు కట్టుకోలేక వారు పడిన అవస్థలు వర్ణనాతీతం . మోటార్ల దొంగల కోసం పడిగాపులు కాస్తున్న రైతులకు ఆరు రోజుల క్రితం తూడిచెర్ల గ్రామంలోని పొలాల వద్ద విద్యుత్ మోటార్లను దోచుకెళ్లేందుకు యత్నిస్తున్న దోర్నాలకు చెందిన కిన్నెరబాబు, మేరిబాబు, పి.లింగాపురం గ్రామానికి చెందిన రాజేష్‌ను పట్టుబడ్డారు. వారిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు దొంగలను విచారించి వారి నుంచి 14 మోటార్లను రికవరీ చేశారనే సమాచారం తెలుసుకొన్న రైతులు తమ మోటార్ల కోసం నిత్యం పోలీసుస్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పోలీసుల విచారణలో ఎన్ని మోటార్లు రికవరీ అయ్యాయి, అందులో ఏఏ గ్రామానికి చెందిన రైతుల మోటార్లు ఉన్నాయనే విషయాలను పోలీసులు చెప్పటం లేదని రైతులు పేర్కొంటున్నారు. దొంగలను పూర్తిస్థాయిలో విచారించి దోచుకెళ్లిన తమ మోటార్లు రికవరీ చేసి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శం





షహనాజ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా, సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

శ్రీశైలంప్రాజెక్ట్: దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అందించని సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసి, ముందంజలో ఉందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఆదివారం సున్నిపెంట గ్రామంలోని వెస్టన్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ ప్రజలను ఆరా తీశారు.మంచినీరు, రోడ్లు, పక్కాగృహాల సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. అర్హులైన వారికి పథకాలు అందకపోతే ధ్రువ పత్రాలతో స్థానిక సచివాలయంలో కలిస్తే విచారించి మంజూరయ్యేలా చేస్తారని చెప్పారు. ఇప్పటికే మంచి నీటి సరఫరా కోసం 5 చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను నిర్మించామని ప్రజలకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. త్వరలోనే ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేయించి నీటిని సరఫరా చేస్తామన్నారు. కాలనీలో దాదాపు సీసీ రోడ్లు వేయించామని, మిగిలిన చోట్ల కూడా పూర్తి చేయిస్తామని తెలిపారు. పేదలకు సుమారు 4 వేల మందికి ఇళ్ల స్థలాలను కేటాయించామని, వారికి త్వరలోనే గృహాలను నిర్మిస్తామని చెప్పారు. అదే కాలనీలో ప్రమాదవశాత్తు ఎడమకాలు విరిగి మంచానికి పరిమితమైన షహనాజ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఇన్‌ఫెక్షన్ చేరి ఆపరేషన్ చేయించుకోలేని స్థితిలో ఉండటంతో రూ.10వేల ఆర్థిక సాయం అదజేశారు. అలాగే ఆపరేషన్ ఖర్చులు కూడా భరిస్తానని, ఏదైనా ఆసుపత్రికి వెళ్లి ఆపరేషన్ చేయించుకుని తనకు సమాచారమివ్వాలని భరోసానిచ్చారు. ఇదిలా ఉండగా బీజేపీ జిల్లా నాయకుడు, బోయ వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకుడు నల్లబోతుల మల్లికార్జున మాట్లాడుతూ.. సున్నిపెంట గ్రామం ఏర్పడి 50 సంవత్సరాలు అయిందని ఇన్ని సంవత్సరాలకాలంలో గ్రామ అభివృద్ధికోసం పాటుపడిన ఎమ్మెల్యేను గతంలో చూడలేదని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానించారు.

పకడ్బందీగా గురుకులం ప్రవేశ పరీక్షలు



అలస్యం కావటంతో కొడుకును వెంటబెట్టుకొని పరీక్ష కేంద్రం వద్దకు పరుగున వస్తున్న తల్లి



విద్యార్థులకు ఓఎంఆర్ షీట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ సుభాన్

జూపాడుబంగ్లా: ఈ ఏడాది గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశానికి విద్యార్థులు అధికంగా ఆసక్తి చూపుతూ ఆదివారం ప్రవేశ పరీక్ష రాశారు. స్థానిక గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ప్రవేశ పరీక్షను రాసేందుకు ఉమ్మడి జిల్లాల నుంచి విద్యార్థులు భారీగా తరలివచ్చారు. 760 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 183 మంది గైర్హాజరు కాగా 577మంది పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ మోహన్ తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్ ప్రథమ ఏడాది ప్రవేశం కోసం పరీక్షలు నిర్వహించారు. మొత్తం 482 మంది విద్యార్థులకు గాను 375 మంది పరీక్షలు రాయగా 107 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. త్వరలో గురుకులాల్లో ప్రవేశం కోసం అర్హత సాధించిన విద్యార్థుల వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

పగిద్యాల: మండలంలోని లక్ష్మాపురం అంచె వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం బీఆర్ అంబేడ్కర్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించారు. 2023-24 విద్యా సవంత్సరానికి సంబంధించి 5వ తరగతికి 675 మంది విద్యార్థులు, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు 313 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఎగ్జామ్ చీఫ్, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణమ్మ ఏర్పాట్లు చేశారు.5వ తరగతి పరీక్షకు 528 మంది హాజరయ్యారని ఎంఈఓ, ఎగ్జామ్ ఓవరాల్ అబ్జర్వర్ సుభాన్ వెల్లడించారు. ఇంటర్మీడియెట్ పరీక్షలకు 259 మంది హాజరయ్యారని వివరించారు. ఎగ్జామ్ అబ్జర్వర్ నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బసవ జయంతి



బసవేశ్వరుడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైర్మల్‌వీధిలో బసవేశ్వర దేవస్థానంలో ఆదివారం వీరశైవ సంక్షేమ సమాజం ఆధ్వర్యంలో బసవ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేపట్టి, పట్టణంలో గ్రామోత్సవం జరిపించారు. అనంతరం చిన్నారులకు లింగాష్టక, బిల్వాష్టక పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఇటీవల రాష్ట్ర వీరశైవ గామ అధికారిగా ఎన్నికైన నందుల మఠం శశిభూషణ్ సిద్ధాంతిని వీరశైవ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. పట్టణ అధ్యక్షుడు కర్నూలు నాగరాజు మాట్లాడుతూ సమాజంలో కులాలను, మతాలను రూపుమాపేందుకు తొలి అడుగు వేసిన మొట్టమొదటి సంఘ సంస్కర్త బసవేశ్వరుడు అని, శివతత్వాన్ని బోధించిన మహానీయుడని కొనియాడారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పెండింగ్ డీఏలు చెల్లించాలి

నంద్యాల(వ్యవసాయం): ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఉపాధ్యాయ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని, సంపాదిత సెలవుల కోసం ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకొని సంవత్సరం దాటిపోయిందని, ఈ మొత్తాన్ని త్వరలో మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరరెడ్డి, విజయరావు, సుమయూన్, జగదీష్, చెన్నుడు, నరసింహులు, శంకర్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

నంద్యాల(అర్బన్): రజకుల ఐక్యతతోనే హక్కులను సాధించుకోవచ్చని ఏపీ రజక ఎస్సీ సాధన చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. స్థానిక రెవెన్యూ నిశాంత్ భవన్‌లో రాష్ట్రస్థాయి రజక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన శ్రీనివాసులు మాట్లాడుతూ కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న రజకులపై పలు జిల్లాల్లో దాడులు, వేధింపులు, బహిష్కరణలు జరిగాయని, వీటన్నింటిపై ఐకమత్యంగా పోరాడాలన్నారు. వృత్తిని చేసుకొని జీవిస్తున్న 50 ఏళ్లు నిండిన రజకులకు రూ.5వేల పింఛన్ ప్రభుత్వం మంజూరు చేయాలని, గ్రామాల్లో దోభీ ఘాట్లను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జూటూరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా అవుకు వెంకటేశ్వర్లు, మురళీమోహన్, ప్రధాన కార్యదర్శిగా చిన్న తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ కుట్రలు

నందికొట్కూరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం మత కలహాలు సృష్టిస్తుందని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఆదివారం పట్టణంలో వాల్మీకి నగర్, వడ్డె పేట, కుమ్మరి పేటలో సీపీఎం ప్రచార భేరీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాల మధ్య చిచ్చు పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. మరోసారి కేంద్రంలో అధికారంలోకి రావడం కోసం ప్రతిపక్షాలను బెదరించడం, కేసులు పెట్టడం దారుణమన్నారు. ప్రాంతీయ పార్టీలపై అక్రమంగా కేసులు బనాయించడం సబబు కాదన్నారు. అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలకు దిగుతున్న బీజేపీకి గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నాయకులు ఫక్కీర్ సాహెబ్, ఉస్మాన్‌బాషా, బీబీ, జయరాణి, ఉపేంద్ర, రాంబాబు, షాలు, వెంకటేశ్వర్లు, నాగరాజు, రఫి, పాండు పాల్గొన్నారు.

కొత్తపల్లి: కేంద్రంలో బీజేపీ సాగిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలందరూ వ్యతిరేకించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని సింగరాజు పల్లె గ్రామంలో ప్రచార భేరీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి వారి హక్కులను కాలరాసిందని మండిపడ్డారు. సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి కె.వెంకటశివుడు పాములపాడు మండల కార్యదర్శి వి.ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

కొత్తపల్లి: మండంలో శుక్రవారం రాత్రి ఈదురు గాలుల ధాటికి పడిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవాటిని విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం ఏర్పాటు చేశారు. గువ్వలకుంట్ల గ్రామంలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలను జోజర్ సాయంతో అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

మహానందిలో పోలీసుల తనిఖీలు

మహానంది: రంజాన్ పర్వదినం మరుసటి రోజు ముస్లింలు అధిక సంఖ్యలో మహానంది వస్తారు. అందులో భాగంగా మాంసాహారం, మద్యం లాంటివి ఆలయ ప్రాంగణాల్లోకి తీసుకు రాకుండా మహానంది పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ జి.నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది రెండు వైపులా ఉన్న టోల్‌గేట్లు, ఆలయ ముఖద్వారం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి భక్తులను దేవస్థానం పరిసరాల్లోకి అనుమతించారు.

వైభవంగా అక్షయ తృతీయ వేడుకలు



మహాలక్ష్మీదేవి పూజల్లో పాల్గొన్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కోటా వీధిలో వెలసిన శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం అక్షయ తృతీయను పురస్కరించుకొని శ్రీ మహాలక్ష్మిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకాలు, సుగుంధ పరిమళ అభిషేకాల అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అక్షయ తృతీయ పూజలు



ద్రాక్ష ఫలాల అలంకారంలో సూర్యనారాయణుడు

కర్నూలు కల్చరల్: అక్షయ తృతీయను పురస్కరించుకుని నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యనారాయణ స్వామి మూల విరాట్‌కు ద్రాక్ష ఫలాలతో విశేష అలంకరణ చేసి దర్శనం కల్పించారు. నవగ్రహ, గణపతి, సంపుటిత శ్రీ సూక్త హోమ సహిత స్వర్ణాకర్షణ భైరవ లక్ష్మీ కుబేర హోమం, రాజ శ్యామల మూల మంత్ర హోమాలు జరిగాయి. అనంతరం ఆలయం సమీపంలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మజ్జిగ, పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వేసవి కాలం ఎండలు తీవ్రంగా ఉండటంతో శ్రీ అనగా దత్త జ్ఞాన బోధ సభా ట్రస్ట్ ఆధ్వర్యంలో దాహార్తిని తీర్చేందుకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శివరామకృష్ణ, డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ నగేష్ వర్మ, ప్రకాష్, రమేష్ వర్మ, జ్యోతి, శైలజ పాల్గొన్నారు.

ప్రసాద్‌కు బెస్ట్ సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డు



ప్రసాద్‌ను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రముఖ కూరగాయల వ్యాపారి లక్కబోయిన ప్రసాద్‌కు రోటరీ క్లబ్ బెస్ట్ సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డును ఆదివారం స్థానిక కార్యాలయంలో పీడీజీ రామలింగారెడ్డి అందజేశారు. రోటరీ సభ్యులు మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి నంద్యాల చుట్టుపక్కల అన్నదాన కార్యక్రమాలు, మహాశివరాత్రికి మహానంది, శ్రీకాళహస్తీశ్వర దేవస్థానాలకు సుమారు 25 టన్నుల కూరగాయలను ప్రతి సంవత్సరం అందజేస్తారని, అందుకు గాను ఈ అవార్డు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, మోహన్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, నెరవాటి సత్యనారాయణ, నాగరాజు, భార్గవవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వెండి పడిగె వితరణ



ఈఓ రామకృష్ణకు వెండి పడిగె అందజేస్తున్న తమ్మినేని నరసింహులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి వారికి దాతలు వెండి పడిగెను బహుకరించారని ఈఓ రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. బేతంచెర్లకు చెందిన తమ్మినేని నరసింహులు, సతీమణి రజినీకుమారి, కుటుంబ సభ్యులు కేజీ వెండితో పడిగెను తయారుచేయించి స్వామి వారికి బహుకరించినట్లు చెప్పారు. దాతల కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామివారి శేషావస్త్రాలు అందించి ప్రత్యేక పూజలు చేయించినట్లు చెప్పారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.